క్లుప్తంగా

బీచ్ రోడ్డులో షూటింగ్ సందడి



నటీనటులకు సన్నివేశాన్ని వివరిస్తున్న కల్కి

కొమ్మాది: బీచ్ రోడ్డు తిమ్మాపురంలో గల డాక్టర్ రామానాయుడు ఫిల్మ్ స్టూడియోలో ఆదివారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. సూపర్‌హిట్ ఫిల్మ్స్ బ్యానర్‌పై డైరెక్టర్ కల్కి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఓ సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు. హీరో శంకర్, హీరోయిన్ ప్రవల్లికలపై పోలీస్‌స్టేషన్ సన్నివేశాలు ఇక్కడ చిత్రీకరించారు. ప్రస్తుత సమాజంలో భర్తలను భార్యలు చంపుతున్న కథాంశంతో ఈ సినిమా తెరకెక్కిస్తున్నామని, త్వరలో సినిమా పేరు ప్రకటిస్తామని దర్శకుడు తెలిపారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



త్రైత సిద్ధాంత భగవద్గీత గురించి ప్రచారం చేస్తున్న సభ్యులు

పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత గురించి ఇందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ సభ్యులు ప్రచారం చేశారు. వెంకటాపురం, అన్నంపేట, అల్లు, ముక్కు వారి కళ్లాల్లో ఈ ప్రచారం జరిగింది. కృష్ణాష్టమి రోజున శ్రీకృష్ణ భగవానుడి ఊరేగింపు విశిష్టత గురించి ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, సభ్యులు మంగమ్మ, రాజు, శ్యామ్, సత్యం, బంగారు తల్లి తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళులు



అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు

భీమునిపట్నం: భీమిలిప్రభుత్వ జూనియర్ కళాశాల వద్దనున్న మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విగ్రహానికి ఆయన వర్ధంతి సందర్భంగా ఆదివారం స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన హిందూ ధర్మ పరిరక్షణ సమితి కన్వీనర్ మైలపల్లి షణ్ముఖరావు కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబ్దుల్ కలాం ఎన్నో కష్టాలు పడి ఉన్నత స్థాయికి చేరుకున్నారని, విద్యార్థులందరు ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజేటి బసవ కృష్ణమూర్తి, కళాశాల సిబ్బంది సరోజ, ప్రసాదరావు, సతీష్‌కుమార్, అరుణ, చక్రవర్తి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



తమ నృత్యంతో ఆకట్టుకున్న కూచిపూడి నృత్య కళాకారిణులు

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం పలువురిని ఆకట్టుకుంది. నగరంలోని సిద్ధేంద్ర యోగి నాట్యాలయం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందుతున్న బాలికలు అద్భుత నృత్య విన్యాసంతో ప్రేక్షకులను అలరించారు. జతి స్వరం నృత్యాంశంలో భాగంగా కళాకారులు ఘటాలపై ప్రదర్శించిన నృత్య విన్యాసాలు కార్యక్రమంలో హైలెట్‌గా నిలిచాయి. చిన్నారి కళాకారులు ఆకాంక్ష, హాసిని, దీక్ష, భవ్య, రాణి, సంజన, మనవిత, నవ్య తదితరులు నృత్యం చేయగా, మోహన లక్ష్మి నృత్య దర్శకత్వం వహించారు. స్థానిక పరిపాలనా అధికారి రమేష్ రెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

పనుల్లో జాప్యం.. ప్రజలకు శాపం

- నత్తనడకన డ్రైనేజీ పూడిక తీత పనులు
- సర్వీస్ రోడ్డు ఇరుగ్గా మారడంతో ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు
- నడక దారి లేక పాదచారుల ఇక్కట్లు
- వేసవిలో చేయాల్సిన పనులు వర్షాకాలంలో చేయడం పట్ల స్థానికుల ఆగ్రహం



డ్రెయిన్ పైమూత తొలగించి కూడా పనులు చేపట్టకపోవడంతో దర్శనమిస్తున్న పూడిక

పీఎం పాలెం: జాతీయ నహదారి సర్వీసు రోడ్డులో చేపట్టిన డ్రైనేజీ పూడిక తీత పనులు స్థానికుల పాలిట అశనిపాతంలా తయారయ్యాయి. జాతీయ రహదారికి కుడి ఎడమల వైఎస్సార్ క్రికెట్ స్టేడియం మొదలుకుని కొమ్మాది కూడలి వరకూ సర్వీసు రోడ్లు నిర్మించారు. అదే పొడవునా డ్రైనేజీ, భారీ తాగునీటి పైపులైను ఉండటంతో పాదచారులు ప్రయాణించేందుకు వీలుగా జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఫుట్‌పాత్ తీర్చిదిద్దింది. అంత వరకూ బాగానే ఉంది. ఆ ఫుట్‌పాత్ అడుగునున్న డ్రైనేజీని ఎన్నో ఏళ్ల నుంచి పట్టించుకోకపోవడంతో



పూడిక తీత పూర్తి అయినా మూత ఫిక్స్ చేయని డ్రెయిన్

డ్రైన్లలో పూడిక విపరీతంగా పేరుకుపోయింది.

తూతూమంత్రంగా పూడిక తీత పనులు..

కారుషెడ్ నుంచి కొమ్మాది కూడలి ఎడమ వైపున ఉన్న డ్రైనేజీ పూడిక తీత పనులు తూతూ మంత్రంగా పూర్తి చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. డ్రైను పైమూతగా అమర్చాల్సిన కాంక్రీట్ పలకలు ఇప్పటికీ కొన్ని చోట్ల అమర్చలేదు.

పైకప్పు లేని డ్రెయిన్లతో భయం భయం..

కారుషెడ్ కూడలి నుంచి జీవీఎంసీ 7వ వార్డులోని చంద్రంపాలెం వరకూ పూడిక తీత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా డ్రైన్లపై మూతలుగా ఉన్న కాంక్రీట్ పలకలు తొలగించారు. ఆ పలకలను అక్కడక్కడ గుట్టలుగా పేర్చారు. దీంతో పాదచారులు నడవడానికి అవకాశం లేకుండా పోయింది. మొత్తం పూడిక తీత పనులు పూర్తయ్యే వరకూ నడకదారి లేనట్టేనా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అలాగే డ్రైనేజీకి పైకప్పుగా ఉండాల్సిన కాంక్రీట్ పలకలు తొలగించడంతో పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

వేసవిలో చేయాల్సిన పనులు వర్షాకాలంలో..

డ్రైనేజీ పూడిక తీత పనులు వేసవిలో చేపట్టి త్వరితగతిని పూర్తి చేయాల్సి ఉంది. ఈ పనులు పూర్తి కాక ముందే వర్షాకాలం ముంచుకు వచ్చింది. దీంతో బయట వేసిన పూడిక వ్యర్థాలు బురదమయంగా మారుతున్నాయి. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి పూడిక తీత పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



కారుషెడ్ కూడలి వద్ద డ్రెయిన్ నుంచి వెలికి తీసిన పూడిక బురద



నడక దారి లేక సర్వీసు రోడ్డులో నడుస్తున్న పాదచారులు



గుట్టలుగా పేర్చిన కాంక్రీట్ పలకలు

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి..



డ్రైనేజీ పూడిక తీత పనులు త్వరితగతిని పూర్తి చేయాలి. సర్వీసు రోడ్డుపై వేసిన పూడిక వ్యర్థాల కారణంగా రహదారి ఇరుగ్గా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఉంది. నడక దారి లేకపోవడంతో పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. సర్వీసు రోడ్డును నడక దారిగా ఉపయోగిస్తే ప్రమాదకరం. వాహనాలు ఢీకొట్టే ముప్పు ఉంది. అందుచేత వెంటనే పనులు పూర్తి చేయాలి.

– ఎన్. తాతారావు, చంద్రంపాలెం.

నడక దారి లేకుండా పోయింది..



పూడిక తీత పనులు చేపట్టిన కారణంగా వృద్ధులు, మహిళలకు నడక దారి లేకుండా పోయింది. ప్రత్యామ్నాయంగా ఏదో ఒకటి చేయాలి.

కారు షెడ్ కూడలిలో వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని పూడిక తీత పనులు, డ్రైన్లపై మూతలుగా కాంక్రీట్ దిమ్మల ఫిక్సింగ్ వెంటనే పూర్తి చేయాలి. లేకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

– పీవీ కృష్ణారావు, కారుషెడ్, పీఎం పాలెం

సేవామూర్తులకు సత్కారం



వాండ్రాసి సతీష్ కుమార్‌ను సత్కరిస్తున్న సీఐ వాసునాయుడు

తగరపువలస: ఆనందపురం మండలం పెద్దిపాలెంలో ఆదివారం ఓఎస్‌జీ ఫౌండేషన్ 4వ వార్షికోత్సవం జరిగింది. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దళాయి శివ ఈ సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాలలో పాలు పంచుకుంటున్న వారిని ఆనందపురం సీఐ సీహెచ్ వాసునాయుడు చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. వీరిలో ప్రముఖ విద్యావేత్త, సామాజిక కార్యకర్త, భీమిలి ప్రైవేట్ ఉపాధ్యాయుల అసోషియేషన్ అధ్యక్షుడు వాండ్రాసి సతీష్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మరో సామాజిక కార్యకర్త వెంపాడ శ్రీనివాసరెడ్డి, బావిశెట్టి రాజు తదితరులు పాల్గొని సన్మానకర్తలకు జ్ఞాపికలు అందించారు.

విద్యార్థులకు సత్యసాయి సేవా సంస్థల వితరణ



శిక్షణ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్లో ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ ఉచిత శిక్షణ తరగతులలో పాల్గొన్న 160 మంది చిన్నారులకు ఆదివారం చిట్టివలస సత్యసాయి సేవా సమితి అల్పాహారం అందించింది. ఈ సందర్భంగా సమితి కన్వీనర్ గొట్టిపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు ఈ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుని విజయం సాధించాలని కోరారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సొసైటీ గౌరవ అధ్యక్షుడు గంటాన మోహనరావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, వీఎస్ కృష్ణా కళాశాల సూపరింటెండెంట్ జి.వి. అప్పారావు, ఉపాధ్యాయులు వంగపండు దుష్యంత్, జగన్నాథం, చిన్నారావు, శివకుమార్, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ శివకుమార్, కో ఆర్డినేటర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

బాబును నమ్మితే మోసం గ్యారెంటీ

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు

కొమ్మాది: సార్వత్రిక ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలతో ప్రచారం చేసిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్కటీ అమలు చేయలేదని, అందుకే చంద్రబాబును నమ్మితే మోసం గ్యారెంటీ అని వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) అన్నారు. ఎండాడలో గల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 5, 6, 7, 8 వార్డుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. చంద్రబాబు, కూటమి పాలకులు చేసిన మోసాలపై వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 18 ఏళ్ల దాటిన మహిళలకు నెలకు రూ. 1500, ఉచిత గ్యాస్ సిలిండర్, ఫీజ్ రియింబర్స్‌మెంట్ వంటి ఎన్నో హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా దేనినీ అమలు చేయకుండా ప్రజలను ఇప్పటికీ మోసం చేస్తున్నారని విమర్శించారు. వార్డు నాయకులు, అధ్యక్షులు, ఒక షెడ్యూల్ ప్రకారంగా ప్రణాళిక వేసుకుని ప్రతి గడపకు వెళ్లి బాబు మోసాన్ని ప్రజల తెలపాలన్నారు. అధికారంలో ఉంటే ప్రజల కోసం పని చేస్తాం.. ప్రతిపక్షంలో ఉంటే ప్రజల పక్షాన పని చేస్తాం. ఇది వైఎస్సార్‌సీపీ విధానం అన్నారు. ప్రస్తుతం అభివృద్ధి పనులు చేయలేక మెట్రో రైలు, సాఫ్ట్‌వేర్ కంపెనీలు వస్తున్నాయని, గ్రాఫిక్స్ మాయాజాలం చూపిస్తున్నారని, ఇది ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. పార్టీలో ఏ కార్యకర్తకైనా, నాయకుడికైనా కష్టం వస్తే అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం 5, 6, 7, 8 వార్డుల అనుబంధ విభాగాలు, జిల్లా రాష్ట్ర కార్యవర్గాల్లో నియమితులైన నాయకుల పేర్లను ఆయన ప్రకటించారు. అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు త్వరలో మీడియా ద్వారా పత్రికా ప్రకటన ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 5, 6, 7, 8 వార్డుల అధ్యక్షులు పోతిన శ్రీనివాసరావు, గుడ్ల పోలిరెడ్డి, పోతిన హనుమంతరావు, బొట్టా అప్పలరాజు, వివిధ విభాగాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు చెన్నాదాస్, వంకాయల మారుతీ ప్రసాద్, జేఎస్ రెడ్డి, కుడితి రామారావు, బెందాలం పద్మావతి, ముదుండి రాజేశ్వరి, చేకూరి రజని, పిల్లా సూరిబాబు, జగ్గపిల్లి నరేష్, అచ్చెన్న, సియాద్రి కనకరాజు, పోతిన ఎల్లాజీ, లొడగల రాంబాబు, సింహాచలం, ముచ్చు రామారావు, మాదు చంటి, బుజ్జి, రమణ మూర్తి, పిల్లా రమణ, అప్పారావు, పోతిన ప్రసాద్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

స్మార్ట్ మీటర్ల భారాన్ని ప్రజలు మోయలేరు



మాట్లాడుతున్న భీమిలి ఏరియా సీపీఐ నాయకుడు రాంబాబు


తగరపువలస: స్మార్ట్ మీటర్ల భారం ప్రజలు మోయలేరని, కూటమి ప్రభుత్వం వెంటనే వాటిని ఉపసంహరించుకోవాలని భీమిలి ఏరియా సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం గుజ్జు రామునాయుడు భవన్‌లో జరిగిన సమావేశంలో ప్రజల సమస్యలపై చర్చించారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమన్న చంద్రబాబు, లోకేష్, పవన్ ఇప్పుడు ప్రజలకు ఏం సమాధానం చెబుతారన్నారు. దీనిపై సీపీఐ ప్రజల తరఫున నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, ఈశ్వరరావు, సన్నిబాబు, లక్ష్మణరావు, గోవింద్, ముత్యాలరావు, వీర్రాజు, తవుడుబాబు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన సేవను ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర పూజ జరిపారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

బీఎస్ఎన్ఎల్ 4జీ సేవల విస్తరణ

భీమునిపట్నం: భీమిలి పరిధిలో బీఎస్ఎన్ఎల్ తన సేవలను విస్తరిస్తుండడంతో వినియోగదారులకు మరింత ప్రయోజనాలు చేకూరుతున్నాయి. గతంలో సెల్ టవర్లు తక్కువగా ఉండడంతోపాటు సిగ్నల్ ఫ్రీక్వెన్సీ సరిగ్గా లేకపోవడంతో వినియోగదారులకు చాలా ఇబ్బందిగా ఉండేది. దీనివల్ల కనెక్షన్లు కూడా బాగా తగ్గిపోయాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు కొత్త సెల్ టవర్ల ఏర్పాటుకు నిర్ణయించారు. అందులోను 4జీ సదుపాయంతో కూడిన టవర్లు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా గత నాలుగు నెలల్లో భీమిలి పరిధిలో ఎనిమిది సెల్ టవర్ల ఏర్పాటు జరిగాయి. ఇవి ఆదర్శనగర్, చెరుకుపల్లి, బొడ్డపాలెం, రామవరం, ఇచ్ఛాపురం, చినదబ్బంద, పెదదబ్బంద, గోరంట్ల తదితర ప్రాంతాల్లో ఏర్పాటయ్యాయి. అలాగే గత మూడు రోజుల క్రితం భీమిలి సమీపంలోని బ్యాంక్ కాలనీ వద్ద కొత్త టవర్‌ను ఏర్పాటు చేశారు. కాగా ఒక్కొక్క టవర్ రూ. 25 లక్షల వ్యయంతో ఏర్పాటు చేశారు. ముఖ్యంగా 4జీ సేవలు అందుబాటులోకి వచ్చిన తర్వాత సిగ్నల్ పరిధి, నెట్ స్పీడ్ బాగా పెరగడంతో వినియోగదారులకు ఎంతో సదుపాయంగా ఉంది. దీని గురించి టెలికంశాఖ జేఈ వీవీఎస్. సత్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ చక్కటి సేవలు అందిస్తోందని, ప్రైవేట్ నెట్‌వర్క్‌ల కన్నా తక్కువ ధరల్లో రీచార్జి చేసుకోవచ్చని తెలిపారు. ఏ సమస్య వచ్చినా సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటారని, జవాబుదారీతనం ఉంటుందన్నారు. అలాగే ఫిర్యాదులు చేయాలంటే 18003451504 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.



బ్యాంక్ కాలనీ సమీపంలో కొత్తగా ఏర్పాటు చేసిన 4జీ టవర్

ఇస్కాన్‌లో మార్మోగిన హరినామ స్మరణ



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: హరే రామ.. హరే కృష్ణ అంటూ సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరం ఆదివారం మార్మోగింది. వారాంతపు పూజల సందర్భంగా ఇస్కాన్ అధ్యక్షులు సాంబాదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని భగవద్గీత శ్లోకాలను ఆలపించారు. ఈ నేపథ్యంలో రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ స్వామి, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు



సభకు హాజరైన విజయరాంపురం ప్రజలు

తగరపువలస: కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడిచినా భీమిలి మండలం లక్ష్మీపురం పంచాయతీ విజయరాంపురంలో తాగునీటి సమస్య పరిష్కరించలేకపోయిందని వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు అన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆయన ఆదివారం సాయంత్రం విజయరాంపురంలో స్థానికులతో మాట్లాడారు. తామంతా వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులమని కూటమి నాయకులు తాగునీరు, రహదారులు, డ్రైనేజీల వంటి వసతులు కల్పించడానికి వెనుకాడుతున్నారని స్థానికులు ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీటి కోసం గ్రామానికి రూ.24 లక్షలు మంజూరైనా గ్రామీణ నీటి సరఫరా డీఈ, ఏఈలు తమకు సహకరించడం లేదన్నారు. ఈ పథకం కోసం మూడు సెంట్ల స్థలం కూడా సమకూర్చుకున్నట్టు చిన్న శ్రీను దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన స్పందించి కాంట్రాక్టర్‌తో మాట్లాడి జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీరు అందించిన అనంతరం డ్రైనేజీలు, రహదారులు పూర్తి చేస్తామన్నారు. మూడు రోజుల్లో అధికారులను గ్రామాలకు రప్పించే బాధ్యత ఎంపీపీ వాసురాజు తీసుకుంటారన్నారు. 14 ఏళ్లు సీఎంగా పని చేసిన చంద్రబాబు అంతకు మించిన అనుభవంతో ఓట్ల కోసం ప్రజలను మోసం చేయడంలో ఆరితేరారన్నారు. 20 లక్షల ఉద్యోగాలు, రూ.3 వేల నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు పథకంపై కప్పదాట్లు వేస్తున్నారన్నారు. అనంతరం గడప గడపకు కరపత్రాల ద్వారా కూటమి ప్రభుత్వం చేసిన మోసాల గురించి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, సర్పంచ్ లచ్చుబుగత జగదీశ్వరరావు, ఉప సర్పంచ్ బమ్మిడి అప్పన్న, పూసర్ల ఎర్రయ్య, బమ్మిడి రమణ, పూసర్ల రాములప్పడు, డొప్ప అప్పలనాయుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సమ్మిడి శ్రీనివాసరావు, చెల్లూరు నగేష్, మద్దిల వెంకటరమణ, కరుభుక్త అప్పలనారాయణ, అక్కరమాని అప్పలనాయుడు, పొట్నూరు చంద్రశేఖర్, మజ్జి సూరినాయుడు, బొడ్డు దుర్గారావు, తుపాకుల అప్పలరాజు, తుపాకుల అప్పలస్వామి, తుపాకుల సురేష్, శిరిగిడి ఈశ్వరరావు, తోట ఎల్లారావు, గంధవరపు ఉష తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి వాంబే కాలనీ సబ్ స్టేషన్



వాంబేకాలనీ సబ్ స్టేషన్‌లో సిబ్బందితో ఈఈ సింహాచలం నాయుడు

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు వాంబే కాలనీలో రు. 4.50 కోట్ల వ్యయంతో నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్‌కి విశాఖ జోన్-3 ఈఈ సింహాచలం నాయుడు ఇతర అధికారులు, సిబ్బంది సమక్షంలో ఆదివారం సాయంత్రం టెక్నికల్ చార్జింగ్ చేశారు. గత కొంత కాలంగా చేపడుతున్న నిర్మాణ పనులు పూర్తి కావడంతో అధికారులు, సిబ్బంది సంయుక్తంగా ఈ పనులు చేపట్టారు. వాంబేకాలనీ పరిసర ప్రాంతాలకు ఇక మీదట ఇబ్బందులు తప్పనున్నాయి. దీంతో ఇది దాదాపుగా అందుబాటులోకి వచ్చినట్టు అయింది.

భూలక్ష్మికి నివాళులు

భీమునిపట్నం: భీమిలిలోని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజనవిభాగం కార్యదర్శి రంభుక్త ప్రభాకర్‌నాయుడు తల్లి రాంభుక్త భూలక్ష్మి సంస్మరణ కార్యక్రమానికి ఆదివారం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఇటీవల భూలక్ష్మి చనిపోగా ఇప్పుడు నిర్వహించిన సంస్మరణ కార్యక్రమానికి ఆయన హాజరై నివాళులు అర్పించి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు, ఇందులో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భూలక్ష్మికి నివాళులు అర్పిస్తున్న మజ్జి శ్రీనివాసరావు

కలుషిత ఆహారంతో హెపటైటిస్ ముప్పు

నేడు అంతర్జాతీయ హెపటైటిస్ దినం



డాక్టర్ చలపతిరావు

మహారాణిపేట: హెపటైటిస్‌పై ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారు. వ్యాధి చివరి దశకు చేరుకున్న తర్వాత వైద్యుల వద్దకు వెళ్తున్నారు. ఇందు కోసం ప్రజల్లో హెపటైటిస్‌పై అవగాహన కల్పించాలని కిమ్స్ ఆస్పత్రి గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం చీఫ్ కన్సల్టెంట్ డాక్టర్ చలపతిరావు ఆచంట అన్నారు. జూలై 28 అంతర్జాతీయ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా పలు విషయాలు తెలియజేశారు. కలుషిత ఆహారం, నీటి వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుందని తెలిపారు. రోడ్ల పక్కన శుభ్రత లేని బండ్ల వద్ద చిరుతిండి వల్ల ఈ వ్యాధి ప్రబలే అవకాశం ఉందన్నారు. ఈ వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ ఇంటి తిండికే పరిమితం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

కోడిపందాల నిర్వాహకుల అరెస్ట్

తగరపువలస: ఆనందపురం మండలం చీమల వెంకటాపురంలో కోడిపందాలు నిర్వహిస్తున్న ఐదుగురిని పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారి వద్ద నుంచి రెండు కోళ్లు, రూ.18 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఆకట్టుకున్న సంగీత, నృత్య ప్రదర్శనలు



నృత్యాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం వద్ద రాధా మదన మోహన మందిరంలో ఆదివారం సాయంత్రం హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ లీలలపై సంగీత, నృత్య సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి రెండు గంటల పాటు నగరానికి చెందిన నృత్యశాల సంస్థ ప్రతినిధి శ్రావణి ఆధ్వర్యంలో చిన్నారులు పి.అనుష్క, ఆర్.ప్రజ్ఞ, ఆర్.రాజ్యలక్ష్మి, వి.మౌనిష, ఎం.జోషిత, పి.దేవంశీ, ఎం.సోవిష్, ఎం.నోషిత, నవ్యశ్రీ, పి.జోశ్విక కృష్ణసాయి, పి.అనూహ్య, ఎం.దర్శిని, బి.నిఖిత, బి.నక్షత్ర, బి.గుంవిక, ఎస్. నీహారిక, డి.దారిని తదితర కళాకారులచే నృత్యాలు ప్రదర్శించారు. వీరిని హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించన భక్తదాస అభినందించారు. ప్రతి ఆదివారం సాయంత్రం నిర్వహించే శ్రీకృష్ణ అర్పణం కార్యక్రమంలో భాగంగా పాల్గొనే కళాకారులు 95425 11108 నంబరులో సంప్రదించాలని అంబరీష దాస కోరారు.